శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త



## కార్పొరేషన్ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దండి

- రికార్డు రూము నిర్మాణ పనులను తనిఖీ చేసిన మేయర్



**నెల్లూరు కార్పొరేషన్,మే 28 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని మేయర్ స్రవంతి జయవర్ధన్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సుమారు 68 లక్షల రూపాయలతో నూతన భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాల కోసం రికార్డు రూము, క్యాంటీన్ లతో పాటు అదనపు గదులను కూడా నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణంలో సూచించిన నాణ్యత ప్రమాణాలు పాటించి, నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను మేయర్ ఆదేశించారు. అనంతరం కార్యాలయం ప్రాంగణంలో మేయర్ పర్యటించారు. కార్యాలయ ప్రాంగణంలో మరింత పచ్చదనాన్ని పెంచి, సుందరీకరణ పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పార్కింగ్ స్థలాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఈ.ఈ శేషగిరిరావు, డి.ఈ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు

## బాలలు వృత్తిలో కనిపిస్తే అధికారులపై చర్యలు తప్పవు



**నెల్లూరు కలెక్టరేట్, మే 28, ప్రభాతవార్త** బడిలో చేర్పించిన బాల యాచకులు తిరిగి యాచక వృత్తిలో కనిపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో సమగ్ర శిశు సంరక్షణ పథకం అమలుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చర్యల నివేదిక గురించి ఆరా తీశారు. దత్తత స్వీకరణ పిల్లల విషయంలో నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. బాల కార్మిక నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కేసుల నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ముఖ్యమైన ప్రదేశాలలో గుర్తించిన బాల యాచకులను బడిలో చేర్పించాలన్నారు. ఇందుకుగాను ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి, జడ్పీ సీఈవో, ఐసిడిఎస్ పిడి సంయుక్త సమావేశాలు నిర్వహించి బడి ఈడు పిల్లలందరూ బడుల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు ప్రారంభించడానికి కొద్ది సమయం ఉన్నందున ఈలోపు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. అలాగే కేజీబీవీ లలో డ్రాప్ అవుట్ అయిన వారిని దగ్గర్లోని కళాశాలల్లో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో కేసులు, జునైల్ కేసుల గురించి సమీక్షించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పిడి సువర్ణ, డిసిపిఓ సురేష్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష పిడి వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

## యోగాంధ్ర కార్యక్రమం ద్వారా శిక్షకులుగా మారండి కమిషనర్ వై.ఓ నందన్







**నెల్లూరు కార్పొరేషన్,మే 28 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2025 కార్యక్రమం ద్వారా నెల్లూరు నగరపాలక సంస్థ సిబ్బంది పూర్తిస్థాయిలో శిక్షణ పొంది, యోగ విద్య శిక్షకులుగా ఇతరులకు తర్ఫీదు ఇవ్వాలని కమిషనర్ వై.ఓ నందన్ ఆకాంక్షించారు. యోగాంధ్ర 2025 కార్యక్రమానికి సంబంధించిన శిక్షణను కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం నిర్వహించారుశిక్షణలో నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ ముఖ్యఅతిథిగా పాల్గొని యోగవిద్యను అభ్యసించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నెల్లూరు నగరపాలక సంస్థలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, వార్డు సచివాలయ కార్యదర్శులు దాదాపుగా 100 మంది వరకు యోగ విద్యలో పూర్తిస్థాయి తర్ఫీదు పొందాలని సూచించారు. శిక్షణ తీసుకున్న వారంతా తమ పరిధిలోని మరో పదిమందికి యోగ విద్య ప్రాధాన్యతను వివరిస్తూ చైతన్యం కలిగించాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2025 కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కమిషనర్ ఆకాంక్షించారు. యోగా ఫర్ ఆల్ - గ్రాస్ రూట్స్ వెల్ నెస్ అంశంపై వార్డు స్థాయి పోటీలను మే 28 నుంచి మే 30 వరకు డివిజన్ల పరిధిలోని మున్సిపల్ పార్కులలో నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు.ఈ పోటీలు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నామని తెలియజేశారు. వ్యక్తిగత ప్రదర్శనలలో భాగంగా ఆసన ప్రదర్శన, సూర్య నమస్కార చాలెంజ్, ప్రాణాయామ ప్రదర్శన, ధ్యానం స్థైర్య పరీక్ష అంశాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి డివిజన్ లో పోటీలు నిర్వహించబడతాయని, పోటీల్లో పాల్గొనదలచిన వారు వారి వార్డ్ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని కమిషనర్ తెలిపారు. ఎంపికైన విజేతలు జిల్లా స్థాయిలో, అనంతరం రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనవచ్చని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, యోగా మాస్టర్స్ డాక్టర్ బాషా, సెలీనా, రవీంద్ర, వెంకటసుబ్బయ్య, పద్మావతి, కావ్యశ్రీ, రేవతి, లాస్య, కోటేశ్వరరావు, నెల్లూరు నగరపా లక సంస్థ సిబ్బంది, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్ వినియోగంపై ఉద్యోగులు అవగాహన పెంచుకోండి

- విద్యుత్ చార్జీలను తగ్గించుకోండి - కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 28,ప్రభాతవార్త:** సోలార్ విద్యుత్ వినియోగంపై నెల్లూరు నగర పాలక సంస్థ వివిధ విభాగాల ఉద్యోగులు, సిబ్బంది అవగాహన పెంచుకొని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఖిసూర్య ఘర్ బిజిలి యోజనఖి పథకాన్ని సద్వినియో గం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ తెలియజేశారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఏ.పి.ఎస్.పి.డి.సి.ఎల్ విద్యుత్ శాఖ, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులతో కలిసి ఉద్యోగులకు అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో విజన్ 2047, గ్రీన్ ఎనర్జీ కార్యక్రమాలలో భాగంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని, కరెంటు బిల్లు తగ్గించుకోడానికి సోలార్ సూర్యఘర్ బిజిలీ యోజన పథకం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఒక కిలో వాట్ విద్యుత్ ఉత్పత్తి సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు లక్ష రూపాయలు ఖర్చు అవుతుందని అందులో 30 సబ్సిడీ లభిస్తుందని వివరించారు. మిగిలిన మొత్తంలో 90 శాతానికి బ్యాంకు ఋణసదుపాయం ఇస్తుందని తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు తప్పనిసరిగా తమ సొంత గృహాలకు సోలార్ విద్యుత్ ప్యానెళ్లను అమర్చుకొని, పథకం విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని కమిషనర్ ఆకాంక్షించారు. వేసవికాలంలో సోలార్ పలకలు ఇంటిపై ఏర్పాటు చేసుకున్నందు వల్ల విద్యుత్ ఉత్పత్తితో పాటు ఇళ్లు కూడా చల్లగా ఉంటాయని తెలిపారు. 25 సంవత్సరాల గ్యారంటీతో ఈ సోలార్ ప్యానెల్స్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఐదు సంవత్సరాలలో మీరు పెట్టే పెట్టుబడి మీకు పూర్తిగా వస్తుందని మిగిలిన 20 సంవత్సరాలు విద్యుత్తును ఉచితంగా వాడుకోవచ్చు అని తెలిపారు.నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలో సోలార్ విద్యుత్ ప్రదర్శనను త్వరలో ఏర్పాటు చేసి ప్రజలకు, ఉద్యోగులకు అవగాహన కల్పించనున్నామని, అదేవిధంగా సచివాలయాల వారీగా అవగాహన సదస్సులను నిర్వహించి లబ్ధిదారుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని కమిషనర్ సూచించారు. విద్యుత్ శాఖ ఎస్.ఈ విజయన్, ఈ.ఈ శ్రీధర్, నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సిటీ ప్లానర్ హిమబిందు, సెక్రటరీ శ్రీలక్ష్మి, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుని సన్మానించిన వేమిరెడ్డి దంపతులు



**నెల్లూరు రూరల్, మే 28, ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులుగా ఎన్నికైన గౌరవనీయులు, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడుని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు ఘనంగా సత్కరించారు. మహానాడు సభ వేదికపై రెండవ రోజున పార్టీ అధ్యక్షుడు ఎన్నిక అనంతరం చంద్రబాబు నాయుడు వద్దకు వెళ్లి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు గారు వేమిరెడ్డి దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# అట్టహాసంగా సామూహిక యోగా కార్యక్రమం

- మనసును శరీరంతో కట్టిపడేసే అద్భుత ప్రక్రియ యోగా - జడ్పీ ఛైర్మన్ అరుణమ్మ
- యోగా ప్రతి మారుమూల పల్లెకు చేరాలి - కలెక్టర్ ఆనంద్





**నెల్లూరు కలెక్టరేట్, మే 28, ప్రభాతవార్త** సామూహిక యోగా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. బుధవారం నెల్లూరులోని స్వర్ణాల చెరువు యోగాభ్యాసకులతో నిండిపోయింది. యోగాంధ్ర 2025 భాగంగా ప్రముఖ పర్యా టక ప్రదేశాల్లో యోగ ఆచరించాలనే ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో స్వర్ణాల చెరువులోని ఇరుగాలమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో సామూహిక యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు వెయ్యి మందికి పైగా యోగ సాధకులతో కలసి జడ్పీ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ ఆనంద్, జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, వివిధ శాఖల అధికారులు వేలాది ప్రజలతో కలిసి సామూహిక యోగా సాధన చేశారు.

**మనసును శరీరంతో కట్టిపడేసే అద్భుత ప్రక్రియ యోగా : జడ్పీ ఛైర్మన్ అరుణమ్మ** పరిపరి విధాలుగా పరిభ్రమించే మనసును శరీరంతో కట్టి పడేసే అద్భుత ప్రక్రియ యోగాయని జిల్లా పరిషత్ ౘెర్ పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. భారతదేశం అందించిన యోగ విద్య నేడు ప్రపంచానికి మార్గదర్శనమైందన్నారు. చంచలమైన మనసును ఏకాగ్రతతో శరీరమందు నిలిపి ఉంచే అద్భుత ప్రక్రియ యోగ అని అన్నారు. శరీరాన్ని, మనసును ఒకే విషయం పై లగ్నం చేస్తే మనిషి అద్భుతాలు సృష్టించే అవకాశం ఉందన్నారు.

**యోగా ప్రతి మారుమూల పల్లెకు చేరాలి : కలెక్టర్ ఆనంద్** యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లా నలుమూలల వ్యాప్తి చెందేందుకు అందరూ కలసికట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరికి యోగా ప్రాధాన్యత తెలిపి వారి దినచర్యలో యోగాను ఒక భాగం చేయడం యోగాంధ్ర ప్రధాన లక్ష్యంగా కలెక్టర్ చెప్పారు. యోగా మార్గంలో పయనిస్తే అనారోగ్యం బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యానికి చేరువ అవుతారని తెలిపారు. వివిధ రకాల వృత్తులు, వ్యాపారాలు చేసేవారు యోగ సాధన చేస్తే తమ తమ వృత్తి ఉద్యోగాల్లో మరింత నైపుణ్యం సాధించి మెరుగైన ఫలితాలు సాధిస్తారన్నారు. చిన్న వయసు నుండే యోగ సాధన చేస్తే ఏకగ్రత, జ్ఞాపకశక్తి పెరిగి విద్యార్థిని విద్యార్థులు తమ చదువుల్లో ముందంజ వేస్తారని వివరించారు. అందరికీ యోగాను చేరువ చేయాలనే మంచి లక్ష్యంతో జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. జూన్ 21న విశాఖలో నిర్వహించే యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, మంత్రులు పాల్గొంటారని, అదేరోజు జిల్లాలో సుమారు 10లక్షల మంది యోగసనాలు ఆచరించేలా కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని మైపాడు బీచ్, పెంచలకోన, ఉదయగిరి పర్యాటక ప్రాంతాల్లో సామూహిక యోగా కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.ఇప్పటికే 300మంది మాస్టర్ ట్రైనర్స్ కు శిక్షణ పూర్తిచేశామని, గ్రామ,వార్డుస్థాయిలో సుమారు 7000మందికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. వీరందరూ గ్రామ, వార్డుస్థాయిలో ప్రజలకు యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం యోగా గురువులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, ఆయూష్ ఆర్జెడి డాక్టర్ పద్మజాతి, మున్సిపల్ కమిషనర్ నందన్, జిల్లా టూరిజం అధికారి ఉషశ్రీ, జిల్లా యోగాసమితి అధ్యక్షులు విజయకుమార్, కార్యదర్శి, పెంచలయ్య, యోగ శిక్షకులు కావ్యశ్రీ, రవీంద్ర, వెంకట సుబ్బయ్య, శ్రీను, దివ్య, సాధన్ తదితరులు పాల్గొన్నారు.

# కాకాణి గోవర్ధన్ రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం

- కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి



**నెల్లూరు రూరల్, మే 28, ప్రభాతవార్త** మైనింగ్ కేసులో అక్రమంగా కాకాణి గోవర్ధన్ రెడ్డి అరెస్టు చేయడాని నెల్లూరు జిల్లా పార్టీ కార్యక్రమంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి తీవ్రంగా ఖండించిన కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని ఎవరన్నా ప్రశ్నించిన, గొంతెత్తి మాట్లాడిన అక్రమ కేసులు పెట్టి వైస్సార్సీపీ నాయకులను జైలు పాలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం రోజులు గడుస్తున్న రాష్ట్రంలో ఎక్కడ చూసినా కేసులు, అక్రమ అరెస్టులు తప్ప అభివృద్ధి లేదు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా వైసీపీలో యాక్టివ్‌గా ఉన్న ప్రతి నాయకులు పైన, కార్యకర్తల పైన అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసి వికృత ఆనందం పొందుతున్నారు. ఈ రోజు రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో మీరు చేస్తున్న అరాచక పాలనకి, అక్రమ అరెస్టులతో వేధిస్తున్న తీరుకి ప్రతిఫలం కచ్చితంగా ఉంటుంది. ఇటువంటి అరాచకాలలో పాలుపంచుకుంటున్న ఏ ఒక్కరిని వదిలే ప్రసక్తి లేదు. వారు చేసిన తప్పులకి ప్రతి ఒక్కరిని కోర్టుకు లాగుతాం. ఈరోజు మా నాయకుడు కాకాణి గోవర్ధన్ రెడ్డిని కలవడం జరిగింది. ఆయన ధైర్యంగా వున్నారు. జిల్లాలో పార్టీ కార్యక్రమాలలో దృష్టి పెట్టి ప్రజావ్యతిరేఖ విధానాలను ఎండగట్టాలని మాకు దిశనిర్దేశం చేయడం జరిగింది. మద్యం కుంభకోణం పేరుతో మా పార్టీలోని ముఖ్యులను కేసులలో ఇరికించి వేధించడంతో పాటు మా నాయకుడు జగన్మోహన్ రెడ్డిని కూడా ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. మా పాలనలో మద్యం విధానంపై మా నాయకుడు జగన్మోహన్ రెడ్డి సుమారు రెండు గంటలు మీడియా సమావేశం నిర్వహించి ప్రతి పాయింట్ లెక్కలతో సహా విశదీకరించి చెప్పడం జరిగింది. దానిపై మాట్లాడలేని తెలుగుదేశం నాయకులు అపనిందలు మాత్రం వేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో మద్యం విధానం పేరుతో ముందుగానే కమిషన్లు మాట్లాడుకుని మద్యం షాపులకు ఆక్షన్లు నిర్వహించి అందులో మా పార్టీ నాయకుల తప్ప ఎవరు టెండర్ వేయకూడదని ముందుగానే భయపెట్టి ప్రభుత్వానికి రావలసిన ఆదాయాన్ని ఏ విధంగా తమ నాయకులు జోబుల్లోకి పంపుతున్నారో చూస్తూనే ఉన్నామన్నారు. పేద ప్రజలకి సమయం వృధా కాకుండా వారి ఇంటి వద్దకే రేషన్ పంపించేందుకు వాహనాలను ఏర్పాటు చేస్తే వాటిని రద్దుచేసి తిరిగి రేషన్ డీలర్లకి రేషన్ పంపిణీ అప్పచెప్పారు. డీలర్లు తమకు నచ్చిన సమయంలో మాత్రమే షాపులు ఓపెన్ చేసి సరిగా రేషన్ పంపిణీ చేయకపోవడం వలన ప్రజలు ఇబ్బంది పడే అవకాశం ఉంది. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఈరోజు చేస్తున్న పాలనతో గ్రామాలలో తెలుగుదేశం నాయకులు తలెత్తుకోలేకపోతున్నారు. తెలుగుదేశం నాయకులు గ్రామాల్లోకి వస్తే జనం తిరగబడే పరిస్థితి వచ్చింది. ఈ ప్రభుత్వం పనిచేసేది గోరంత ప్రచారం మాత్రం కొండంతగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో సహా ప్రభుత్వంలోని పెద్దలంతా అమరావతి మీద దృష్టి పెట్టి నిధులు అన్ని అమరావతికి మళ్లించి వారికి డబ్బు మూటలు చెల్లించే కాంట్రాక్టర్లకు అత్యధిక రేటుకు పనులు అప్పజెప్పుతూ అందులో కమిషనర్ రూపంలో దోచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

# గత పాలన విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం పరుగులు

- సీఎం చంద్రబాబునాయుడుతోనే స్వర్ణాంధ్ర - 2047 సాకారం
- నారా లోకేష్ సంస్కారం చాలా గొప్పది
- నియంతతో పోరాడి రాష్ట్రాన్ని, తల్లిదండ్రులను కాపాడుకున్నారు
- ఉత్తమ నాయకత్వ లక్షణాలున్న అధినేతలతో పని చేయడం ఎంపీ వేమిరెడ్డికి, నాకు గర్వకారణం
- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి
- మహానాడులో గత పాలన విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగులు అన్న తీర్మానాన్ని బలపరుస్తూ ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ప్రసంగం





**కోవూరు, మే 28, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రం గత పాలన విధ్వంసం నుంచి వికాసం వైపు పరుగులు పెడుతోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. రెండవ రోజు మహానాడులో గత పాలన విధ్వంసం నుంచి వికాసం వైపు అన్న తీర్మానాన్ని ఆమె బలపరుస్తూ తన సందేశాన్ని ఇచ్చారు. స్వర్గీయ ఎన్టీఆర్ సినిమాలు చూస్తు పెరిగామని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు క్రేజ్, ఇమేజ్‌తో పాటు ఆయన విజన్ అందుకొని తాము ఎంచుకున్న వ్యాపార రంగంలో అప్డేట్స్ చేసుకున్నామన్నారు. లోకల్ టు గ్లోబల్ లీడర్‌గా ఉంటూనే మాలాంటి కొత్త వారికి అవకాశం కల్పించడం చిన్న విషయం కాదన్నారు. రాజకీయాన్ని సేవలా భావించే మాలాంటి వారికి ఆయన గౌరవం ఇవ్వడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాజకీయ పార్టీకి వారసుడు కావడం అనేది పెద్ద సాహసమని, అలాంటిది కార్యకర్తల మనసు గెలిచిన లీడర్‌గా నారా లోకేష్ తనను తాను నిరూపించుకున్నారని ప్రశంసలు కురిపించారు. విపత్కర పరిస్థితుల్లో తల్లిదండ్రులను పార్టీని కాపాడుకుంటూ రాక్షసంగా పరిపాలించిన నియంతతో పోరాడినప్పుడే ఆయన శక్తి ఏంటో తెలిసిందన్నారు. ఉత్తమ నాయకత్వ లక్షణాలు, మనసున్న అధినేతలతో కలిసి పని చేయడం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌కి, తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ నేతకు దక్కని గౌరవం నారా చంద్రబాబునాయుడుకి దక్కిందన్నారు. కష్టపడి పని చేయడం, నిజాయితీగా ఉండటం, నిత్యం ప్రజల భవిష్యత్తు కోసం బతకడం వల్లే ప్రజల గుండెల్లో ఇప్పటికి చంద్రబాబు నిలిచి ఉన్నారన్నారు. నిన్నటి విధ్వంసం నుంచి రేపటి వికాసం వైపు రాష్ట్ర ప్రయాణం సాగుతున్న నేపథ్యంలో అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా, సవాళ్లను, కష్టాలను ఎదుర్కొని నిలబడి సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పౌరుడు గర్వపడేలా నా రాజధాని అమరావతి అని చాటేలా నిర్మాణం చేపట్టారు. ఏడాదికి 15 శాతం వృద్ధి సాధనతోనే స్వర్ణాంధ్ర-2047 సాధికారమవుతుందని స్పష్టం చేశారు. 2047 నాటికి 38 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీని చేయాలని సీఎం లక్ష్యంగా పెట్టుకున్నారని, రాష్ట్ర తలసరి ఆదాయం 55 లక్షల సాధనకు 10 సూత్రాలతో ప్రణాళిక రూపొందించారన్నారు. 60 శాతం పట్టణీకరణ, నిరుద్యోగిత తగ్గించడం, 39.12 లక్షల ఎగుమతులను సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నారని వివరించారు. 2029 నాటికి తలసరి ఆదాయం 5,42, 985 సాధించడమే లక్ష్యమన్నారు. కొన ఊపిరితో ఉన్న రాష్ట్రాన్ని కాపాడటమే కాదని, ఆంధ్రప్రదేశ్ అని సగర్వంగా చాటేలా బృహత్ బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుందని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. పది లక్షల కోట్ల అప్పులు, గాడి తప్పిన వ్యవస్థలు, అస్తవ్యస్తంగా ప్రభుత్వ శాఖలు, పెండింగ్ బిల్లులు వంటి అనేక సవాళ్ల మధ్య తన పాలనానుభవంతో సీఎం చంద్రబాబు పరిపాలన చేస్తున్నారని అన్నారు. ఎన్నికల హామీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. పేదల సేవలో అనే కాన్సెప్ట్‌తో పాలన చేస్తూనే వారి జీవన ప్రమాణాలు మార్చే పథకాలు అనేకం అమలులోకి తీసుకువచ్చారన్నారు. 2014లో 16,000 కోట్ల రెవెన్యూ లోటుతో పాలనను ప్రారంభించినా, 120కి పైకా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం పేదవాడు తినే అన్న క్యాంటీన్ ను కూడా మూసివేసిందని, కానీ నేడు సంక్షేమం వైపు వెళ్తూ మళ్ళీ పథకాలకు ప్రాణం పోసేలా పెన్షన్లు 4 వేలకు పెంచారన్నారు. దేశంలో అత్యధిక పింఛను ఇచ్చే రాష్ట్రం మనదే అని, అధికారం చేపట్టిన మొదటి నెల నుంచి 64 లక్షల మందికి ఇంటి వద్ద పెన్షన్లు ఇవ్వడలుగుతున్నామన్నారు. సూపర్ 6 పథకాల అమలుకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం, రాష్ట్రాభివృద్ధికి 25 పైగా నూతన పాలసీలు ఇండస్ట్రీయల్ డవలప్‌మెంట్ పాలసీ, ఎంఎస్ఎం పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ వంటి పాలసీలు అమలు చేస్తూ బ్రాండ్ ఏపీకి శ్రీకారం చుట్టారన్నారు. 5000 కోట్లతో కొప్పర్తి, ఓర్వకల్లులో ఇండస్ట్రీయల్ పార్కులు, కర్నూలులో డ్రోన్ హబ్ ఏర్పాటుకు 300 ఎకరాల కేటాయింపు జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు నారా లోకేష్ ఇద్దరు కలిసి ఎన్నో ప్రయాసల కోర్చి పేదల గుండె చప్పుడు వింటూ మహోన్నత కార్యక్రమాలు అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారని కొనియాడారు. ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేసి ఎమ్మెల్యేలను ప్రజలకు దగ్గర చేయడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి వారి నాయకత్వంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తాను కూడా భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు.

## దయాడాట్ ఆధ్వర్యంలో విశిష్ట సేవలు అందించిన వారికి అవార్డుల ప్రధానోత్సవం



**నెల్లూరు, మే 28, ప్రభాతవార్తవిద్య :** తమ ఫౌండేషన్ ప్రథమ వార్షికోతవాన్ని పురస్కరించుకని సమాజంలో విశిష్ట సేవలు అందించిన పలువురుకి అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించనున్నామని దయాడాట్ ఫౌండేషన్ నిర్వాహకులు హుస్సేన్ కిర్మాణి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని స్థానిక టౌన్ హాల్‌లో విలే కరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తమ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జులైలో వార్షికత్సోవ వేడుకలను ఘనంగా నిర్వహించటం జరుగుతుందన్నారు. సమాజంలో విశిష్ట సేవలు అందించిన వారికి, వ్యాపార రంగంలో ఎక్సలెన్సీ పొందిన వారికి లైఫ్‌టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డులను అందించటంతోపాటూ జులై 12,13 తేదీల్లో పుర మందిరంలో నృత్యపోటీలు నిర్వహించిన గెలుపొందిన వారికి సైతం వార్షికోత్సవంలో బహుమతులు అందింటచం జరుగుతుందన్నారు. గత అనేక నెలలుగా తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతూనే ఉన్నామని, భవిష్యత్‌లో కూడా వాటిని చేపట్టడం జరుగుతుందన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి , ఈగ బాస్కర్‌రెడ్డిలు మాట్లాడుతు ఎన్ఆర్ఐ అయిన ఫౌండేషన్ నిర్వాహకులు హుస్సేన్ కిర్మాణి విదేశాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని, ప్రస్తుతం నగరంలో ఈ సేవా కార్యక్రమాలను చేపటడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ప్రథమ వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపియూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయప్ర కాష్, నృత్య దర్శకులు రమణయ్య, ఫౌండేషన్ సబ్యులు ఆంటోని , రాజా, చెన్నకేశవ, వంశీ, వినయ్, సలీమ్, సంతోష్, ఖాదర్‌మస్తాన్,ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## సినిమా దియేటర్ల పరిశీంచిన తహసిల్దారు



**బుచ్చి మే 28 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలోని సినిమా దీయేటర్లను తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు పరిశీలించారు. సినిమా ధియోటర్‌లో ఉన్న వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతు ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని దియేటర్ యజమానులకు ఆయన సూచించారు. ఈ సందర్భంగా భీఫామ్ లైసెన్స్, ఫైర్ సేఫ్ట్ మెడికల్ కిట్‌లపై దియేటర్ యజమానులను విచారించారు. డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆదేశాల మేరకు సినిమా దియేటర్లను ఆకస్మికంగా తనీఖి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం దియోటర్ ఉన్న వసతులను నమోదు చేసుకొని నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అన్నారు ఈకార్యక్రమంలో ఆర్ఐ రమణయ్య,విఆర్ఒ పద్మ,విఆర్ఒ సుధాకర్ తదితరులున్నారు.

## సినీ థియేటర్లలో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే టిక్కెట్లు అమ్మాలి

### చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తే కఠినచర్యలు తప్పవు



**కావలి, మే28 ప్రభాతవార్త :** సినీ థియేటర్లలో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే టిక్కెట్లు అమ్మాలని, చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తే కఠినచర్యలు తప్పవని థియేటర్ల యాజమాన్యాలకు కావలి ఆర్డీఓ వంశీకృష్ణ తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేశారు. బుధవారం కావలి పట్టణంలోని మానస, వెంకటేశ్వర, స్రవంతి థియేటర్లలో కావలి ఆర్డీఓ వంశీకృష్ణ, తహశీల్దారు శ్రావణ్‌కుమార్‌లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. థియేటర్ల లైసెన్సులను పరిశీలించారు. ఫైరింగ్ అనుమతులను చూశారు. పార్కింగ్ స్థలాలు తనిఖీ చేశారు. క్యాంటీన్‌లలో తినుబండారాల రేట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వంశీకృష్ణ మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు సినిమా థియేటర్లలలో తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. థియేటర్లలో ప్రేక్షకులకు వసతులు కల్పించాలన్నారు. థియేటర్లలో సీట్లకు తగ్గట్టుగా పార్కింగ్ స్థలాలు ఉండాలన్నారు. క్యాంటీన్‌లలో ఎమ్మార్పీ ధరలకే తినుబండారాలు, కూల్‌డ్రింక్స్ అమ్మాలన్నారు. ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మితే కఠినచర్యలు గైకొనడం జరుగుతుందన్నారు. వాష్‌రూమ్స్ ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండాలన్నారు. తరచూ తనిఖీలు ఉంటాయన్నారు. ఈ తనిఖీలలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## డీ ఆర్ డీ ఏలో ఘనంగా ఎన్ టీ ఆర్ జయంతి వేడుకలు



**నెల్లూరు కలెక్టరేట్, మే 28, ప్రభాతవార్త :** నందమూరి తారక రామారావు 102వ జయంతిని పురస్కరించుకొని జిల్లా డీ ఆర్ డీ ఏ కార్యాలయంలో పీడీ నాగరాజ కుమారి తమ కార్యాలయం ఆవర ణంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీ ఆర్ డీ ఏ కార్యాలయంలోని అధికారులు పాల్గొన్నారు.

## యోగాంధ్రా కార్యక్రమములో పాల్గొన్న ఏ పి ఎన్ జి జి ఓస్



**నెల్లూరు కలెక్టరేట్, మే 28, ప్రభాతవార్త :** 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ రోజు నెల్లూరులోని స్వర్ణాల చెరువు దగ్గర ఏర్పాటు చేసిన యోగాంధ్రా కార్యక్రమ ములో జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి పాల్గొన్న ఏ పి ఎన్ జి జి ఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్కాకుల పెంచలయ్య, మహిళా విభాగం జిల్లా చైర్పర్స న్‌చిన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పరిపూర్ణ తెలుగు మాధ్యమ పాఠశాలలు లేని తెలుగు రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్



**నెల్లూరు కలెక్టరేట్, మే 28, ప్రభాతవార్త :** రాష్ట్రంలో పరిపూర్ణ తెలుగు మాధ్యమ పాఠశాలలు కొనసాగించాలని బిజెపి నేత మిడతల రమేష్ నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ ఉదయభాస్కర్, నెల్లూరు ఆర్డీవో నాగ అనూషలకు విజ్ఞప్తి చేశారు. తెలుగువారి ఆత్మగౌరవంను ప్రపంచానికి చాటిన ఎన్టీఆర్ జయంతినీ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న సందర్భంగా రమేష్ తెలుగు మాధ్యమ పాఠశాలల కొరకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం అనధికారకంగా తెలుగు మాధ్యమ పాఠశాలలను ఎత్తేసి నిర్బంధ ఆంగ్ల మాధ్యమం నిర్వహించడం వలన రాష్ట్రంలో 30 శాతం మంది గ్రామీణ విద్యార్థులు సమగ్రమైన విద్య అవగాహనను కోల్పోయారన్నది చారిత్రాత్మక సత్యం. అందుకో లేకుండా మన తెలుగు రాష్ట్రంలో తమిళం ఉర్దూ మాధ్యమ పాఠశాలలు కొనసాగుతున్నాయి. తెలుగు మాధ్యమ పాఠశాలలు మాత్రం తెలుగు ప్రజలకు ప్రపంచ బ్యాంకు నిధులు కోసం తెలుగు మాధ్యమాన్ని తాకట్టు పెట్టడం ఆందోళన కలిగించే అంశంగా రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరు నాగేంద్ర సింగ్, నరాల సుబ్బారెడ్డి. ఏవి సుబ్బయ్య, పద్మావతి, కేశవ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ శాఖలో ఉత్తర్వులు అందించిన డీఆర్ఓ



**నెల్లూరు కలెక్టరేట్, మే 28, ప్రభతవార్త :** మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తూ మరణించిన పి.పెంచలయ్య బదులుగా ఆయన కోడలు పి.శ్రావణికి , డిఆర్ఓ ఉదయభాస్కరరావు, ఏఓ విజయ్ కుమార్ చేతుల మీదగా రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా నియామక పత్రం అందించారు.

## థియేటర్లు ఆకస్మిక తనిఖీ చేసిన తహశీల్దార్



**లింగసముద్రం, మే28, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో గల సినిమా థియేటర్లను లింగసముద్రం తహశీల్దార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా సినిమా థియేటర్లు పరిశుభ్రంగా ఉన్నాయా లేవా అని పరిశీలించారు. అలాగే థియేటర్లకు సంబంధించిన లైసెన్సులు పరిశీలించారు. ప్రస్తుతానికి రెండు సినిమా థియేటర్లు మూసివేసి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.సీత మహాలక్ష్మీ, ఆర్ఐ ఎం.రమణయ్య, వీఆర్వో మస్తాన్ వలి పాల్గొన్నారు.

## పిల్లల శారీరక వృద్ధి పర్యవేక్షణ చేయాలి



**నెల్లూరు కలెక్టరేట్, మే 28, ప్రభాతవార్త :** పుట్టిన ప్రతి బిడ్డ యొక్క ఖచ్చితమైన ఎత్తు బరువు నమోదు చేయాలని, తక్కువ ఉండే వారికి సరైన పోషణ, వైద్య సేవలు అందించటానికి అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ తెలిపారు. బుధవారం ఐ సి డి యస్ కార్యక్రమాలపై సి డి పి ఒ, సూపర్ వైజర్లతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేం ద్రాల తనిఖీ సమయంలో పిల్లల శారీరక వృద్ధి పర్యవేక్షణ చేయాల న్నారు. క్షేత్రస్థాయిలో పిల్లల ఖచ్చితమైన ఎత్తు బరువుల వివరాలు నమోదయ్యేలా చూడాలన్నారు. తప్పుడు డేటా నమోదు చేస్తే చర్యలు తప్పమన్నారు. ఇందుకు గాను అంగ న్వాడీ సూపర్వైజర్లు వ్యక్తిగత బాధ్యత తీసుకొని పనిచేయాలన్నారు. వృద్ధి రేటు తక్కువగా నున్న పిల్లల తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడాలన్నారు. సరైన పోషకాహారం, వైద్య సేవలు అందించి సాధారణ స్థితికి వచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పిడి సువర్ణ, సిడిపిఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## జడ్పీలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**నెల్లూరు కలెక్టరేట్, మే 28, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని దర్గామిట్ట, నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహి ంచారు. ఈ కార్యక్రమాన్ని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీ సర్ విద్యా రమ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీ సర్ మోహన్ రావు, జిల్లా ప్రజా పరిషత్, సిబ్బ ందితో కలిసి నిర్వహించారు. ఎన్‌టి రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రజా సేవ సినిమా రంగాలకు ఆయన చేసిన విశేష కృషిని గొప్ప గౌరవంతో గుర్తు చేసుకున్నారు.

## తెలుగు ప్రజల గుండెల్లో ఎన్‌టిఆర్ స్థానం పదిలం



**నెల్లూరు కలెక్టరేట్, మే 28, ప్రభాతవార్త :** బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ చలనచిత్ర నటుడు, పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు జయంతి ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకకు ముఖ్య అతిథులుగా నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావు తదితరులు హాజరయ్యారు. తొలుత ఎన్‌టిఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని దశదిశలా చాటిన మహానాయకుడు ఎన్‌టిఆర్ అని అన్నారు. తెలుగువారి సత్తాను చాటుతూ పార్టీని స్థాపించిన 9 నెలల్లోనే అధికారం చేపట్టిన ఏకైక నాయకుడు రామారావు అని కొనియాడారు. జీవితంలో కష్టసుఖాలను సమపాళ్లలో అనుభవించిన వ్యక్తి ఎన్‌టిఆర్ అని, అనేక సంస్కరణలతో పేదల జీవితాల్లో వెలుగు నింపారన్నారు. ఎన్‌టిఆర్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్న శ్రీనివాసులురెడ్డి, సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తాను చిన్నప్పటి నుంచి ఎన్‌టిఆర్ అభిమానినని, బాలకృష్ణతో తనకు మంచి సన్నిహిత సంబంధం ఉండడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. పేదల సంక్షేమం కోసం పరితపించి అనేక సంస్కరణలతో వారి జీవితాల్లో ఎన్‌టిఆర్ వెలుగులు నింపారన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా చెన్నై ప్రజల దాహార్తి తీర్చిన గొప్ప దార్శనీకుడు ఎన్‌టిఆర్ అని, తెలుగుప్రజల గుండెల్లో ఎప్పటికీ ఎన్‌టిఆర్ చిరస్థాయిగా నిలిచి వుంటారన్నారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ ఎన్ టి ఆర్ స్ఫూర్తితో మన రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజలో పయనించేలా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలుగువారు గర్వించే నేత ఎన్టీఆర్ అని కొనియాడారు. సంగీతం, కవిత్వం, చలనచిత్రం మొద్దలైన కళారూపాల ద్వారా ప్రజల్లో మార్పు సాధ్యమన్నారు. ఆయా రంగాల్లో నిష్ణాతులైన గొప్ప వ్యక్తులను గౌరవించడం, వారు చూపిన సన్మార్గంలో పయనించి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావడం మనందరి కర్తవ్యంగా జేసీ చెప్పారు.



**– ప్రత్యేక ఆకర్షణగా ఎన్‌టిఆర్ జీవిత చరిత్ర ఫొటో ఎగ్జిబిషన్**

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సినిమా, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ సేవలను గుర్తుచేసేలా రూపొందించిన చిత్రాలు ఆనాటి మధురస్మృతులను గుర్తుకు తెచ్చారు. కలెక్టర్ ఆనంద్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జేసీ కార్తీక్, డిఆర్‌వో ఉదయభాస్కర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు. ఎన్టీఆర్ చిత్రాలను సేకరించి అందంగా ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసిన సమాచార శాఖ అధికారి సదారావును, సిబ్బందిని అభినందించారు.

**– కళాకారులను సత్కరించిన కలెక్టర్**

విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా కళాకారులు ఆలపించిన దేశభక్తి గీతాలు, పౌరాణిక సన్నివేశాలు అందరిని ఆకట్టుకున్నాయి. భాస్కర్, మధుసూధన్ పాడిన పుణ్యభూమి నాదేశం, జననీ జన్మభూమిశ్చ మొదలైన ఎన్‌టిఆర్ పాటలు, నరసింహారావు దుర్యోదని ఏకపాత్ర సన్నివేశాలు ఎన్‌టిఆర్ నటన చాతుర్యాన్ని గుర్తుకు తెచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ కళాకారులను సత్కరించి నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యతగా ఎపిఎంఐపి పిడి శ్రీనివాసులు వ్యవహరించగా, పలువురు అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగు జాతి ఆణిముత్యం ఎన్టీఆర్

**– టిడిపి సీనియర్ నాయకులు బాలకృష్ణ**



**విడవలూరు, మే 28, ప్రభాతవార్త :** తెలుగుజాతి అభిమానుల హృదయాల్లో అవతార పురుషుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావును మరువలేనిదని సీనియర్ టిడిపి నాయకులు తాత బాలకృష్ణ పేర్కొన్నారు. 102వ ఎన్టీఆర్ తెలుగు జాతి ఆణిముత్యం యుగపురుషుడు జయంతి వేడుకలు మండలం పార్లపల్లి గ్రామం మల్దేవి సెంటర్లో ఘనంగా టిడిపి నాయకులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మగౌరవానికి వన్నెతెచ్చిన కీర్తిమంతుడు, నీతివంతమైన రాజకీయాలకు నిజాయితీగా అందరి హృదయాల్లో నిలిచిన ఎన్టీఆర్ అని కొనియాడారు. అంతకు ముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏగూరు చంద్రారెడ్డి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకి ఘన నివాళి



**నెల్లూరు క్రైమ్ మే 28 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జి. కృష్ణకాంత్ పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ క్రమశిక్షణ, పట్టుదల భావి తరాలకు స్ఫూర్తిదాయకమని, వారి నైతిక విలువలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ కీర్తిని, తెలుగు ప్రజలకు, రాష్ట్రానికి అయన చేసిన సేవలను కొనియాడారు.

## ఎండియు ఆపరేటర్ల వద్ద నుండి కాలా కంపెనీ మిషన్లు డీలర్లకు అందజేత



**కొడవలూరు, మే 28, ప్రభాతవార్త:** మండలంలోని కాలా కంపెనీ మిషన్లను సంబంధించిన వాళ్ళు బుధవారం తహసిల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి ఆధ్వర్యంలో పరిశీలన చేశారు. గతంలో ఉన్న ఎండియు ఆపరేటర్లను తొలగించడం జరిగిందని ఒకటో తేదీ నుండి రేషన్ డీలర్లకి ఎండియు మిషన్లు అందజేయడం జరుగుతుందని డిప్యూటీ తహసిల్దార్ సారంగపాణి తెలియజేశారు. ఈ కాలా కంపెనీ మిషన్లు తహసిల్దార్ కార్యాలయంలో చెక్ చేయడం జరిగింది కానీ ఆయా గ్రామాల్లోని పనిచేస్తుందని తెలిపారు.సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు రేషన్ సరుకులు సంబంధిత డీలర్లు ఇళ్లకు వెళ్లి అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ సభ్యత్వ ప్రతాల అందజేత



**నెల్లూరు,మే28 ప్రభాతవార్తవిద్య :** తమ పార్టీలో క్రియాశీలక సభ్యులకు, నాయకులు సభ్యత్వ నమోదు పత్రాలను పంపిణీ చేయటం సంతోషంగా ఉందని జనసేన పార్టీ కోర్ కమిటీ సభ్యులు నూనెమల్లిఖార్జున యాదవ్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని స్థానిక మాగుంట లేఅవుట్‌లోని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యాలయంలో సభ్యత్వ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూనె మాట్లాడుతు తమ పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి, రాష్ట్ర టిడ్కోచైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా లో రికార్డు స్థాయిలో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగిందన్నారు. పార్టీలోచేరి సభ్యత్వం తీసుకున్న అందరికి రూ.5లక్షల ప్రమాదభీమా వర్తింస్తుందన్నారు. దీంతో పార్టీ కార్యకర్తల కుటుంబాలకు రక్షణ ఏర్పడుతుందని తెలిపారు. ఈ సభ్యత్వ నమోదులో పురుషులతో పోటీగామహిళా కార్యకర్తలు కూడా పోటీ పడి సభ్యత్వ నమోదు చేయటం గర్వకారణమన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం సభ్యులకు పత్రాలు, ఐడీ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, కార్యాలయ ఇన్‌చార్జ్ జమీర్, రూరల్ అధ్యక్షులు పావుజెన్ని చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు శ్రీరాం, ఏటూరి రవికుమార్, కృష్ణారెడ్డి, రాజేష్, సుధామాదవ్, శ్రీరామ్,పి.శ్రీకాంత్, దినేష్, చంటి, మహేష్, కృష్ణవేణి, ప్రసన్న, శాంతికల, తదితరులు పాల్గొన్నారు.

## మహానాడుకు బయలుదేరిన టీడీపీ కార్యకర్తలు



**లింగసముద్రం, మే28, ప్రభాతవార్త :** కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి రెండో రోజు టీడీపీ కార్యకర్తలు మహానాడు కార్యక్ర మానికి వెళ్లడం జరిగింది. ఎంతో ప్రతిష్ఠా త్మకంగా నిర్వహిస్తున్నటువంటి ఈ కార్యక్ర మంలో పాలుపంచుకునేందుకు ప్రతి టీడీపీ కార్యకర్త కోరుకుంటున్నారు. అదే విధంగా లింగసముద్రం నుంచి బుధవారం రోజున మహానాడుకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమానికి బింకం శేషయ్య, నీలం బ్రహ్మయ్య, జి.బాల నారాయణ, కిలారి, రమణయ్య, పూరిమెట్ల గురునానం, పలువురు టీడీపీ కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు.

## ఎస్సీ, ఎస్టీ కేసులో డీఎస్పీ విచారణ



**తోటపల్లిగూడూరు, మే28, ప్రభాతవార్త :** తోటపల్లిగూడూరు మండలంలోని కోవెరపాలెం గ్రామంలో గత నెలలో ఒక పొలం వివాదంలో తోటపల్లిగూడూరు గమల్లపాలెంకు చెందిన కొంత మంది దళితులపై దౌర్జన్యం చేసి దుర్భాషలాడిన ఘటనలో వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. ఆ కేసులో భాగంగా బుధవారం రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు విచారణ జరిపారు. ఆయనే స్వయంగా ముత్తుకూరు సీఐ రవి నాయక్ తోటపల్లి గూడూరు ఎస్సై వీరేంద్రబాబుతో కలిసి కోవెరపాలెం గ్రామానికి వచ్చి బాధితులైన తేలిమేటి ఉదయ్ కుమార్, అలాగే నక్క వివేక్‌లను పిలిపించి పూర్తిగా జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. గత నెలలో వివేక్ నక్క వివేక్ అనే వ్యక్తి కోవెర పాలెం గ్రామానికి చెందిన దండు వెంకట సుబ్బయ్య వద్ద భూమి లీజుకు తీసుకుని సాగు చేసుకునేందుకు పొలం దగ్గరకు తేలిమేటి ఉదయ్‌కుమార్‌ను తీసుకుని పొలం వద్దకు వెళ్లడం జరిగింది. అయితే పొలం ఇచ్చిన వాళ్ళకి తోటపల్లిగూడూరు గమల్లపాలెంకు చెందిన కొంత మంది వ్యక్తులకు పాత వివాదాలు ఉండడంతో పొలం వద్ద కుల దూషణలతో గొడవ జరిగిన విషయం తెలిసిందే. అయితే అప్పుడు జరిగిన గొడవలలో ఎస్సీ, ఎస్టీ కేసు తోటపల్లిగూడూరు పోలీసు స్టేషన్లో నమోదైంది. ఆ కేసు విషయమై డీఎస్పీ పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తానని తెలిపారు.

## అల్లూరు దత్త సాయి మందిరంలో దొంగలు



**అల్లూరు,మే 28,ప్రభాతవార్త:** అల్లూరు పేట శివాలయం వీధిలోని దత్త సాయి మందిరంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు పడి తలుపులు పగలగొట్టిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు వివరాలు మేరకు రాత్రి వేళ దొంగలు సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేసి బాబా మందిర ముఖ ద్వారంకు ముందు గ్రిల్స్ కు వేసి ఉన్న తాళాలను పగలగొట్టి తలుపులును పగలగొట్టేందుకు ప్రయత్నించగా తలుపులు తీర్చుకోలేదని తెలిపారు. అదేవిధంగా వారం రోజుల క్రితం అల్లూరు లోని తూర్పు వీధిలో దొంగలు పడి తలుపులు బీరువాలు పగలగొట్టగా. మంగళవారం అర్ధరాత్రి బలిజ పాలెంలోని పెంచలయ్య ఇంట్లో దొంగలు తలుపులు బీరువాలు పగలగొట్టారు. పేయ్యలవారి వీధి లో బేల్దారు రఫీ మూడు రోజుల క్రితం నాగూర్ కి వెళ్లి బుధవారం ఉదయం ఇంటికి తిరిగి రాగా తలుపులు పగలగొట్టి ఉన్నాయని బీరువను సైతం ధ్వంసం చేసి ఐదు సవర్లు బంగారు. 90.000 నగదు దొంగలు దోచుకు వెళ్లాగా పోలీసులు వచ్చి పరిశీలించి వెళ్లారు. వారం రోజులు వ్యవధిలో అల్లూరులో వరుస దొంగతనాలు జరగడంతో ప్రజలు భయాందోళనలకు గురి అవుతున్నారు

## జెవివి విజయ్‌కుమార్‌రెడ్డికి ఘన నివాళులు

**వరికుంటపాడు,మే28,ప్రభాతవార్త:** జనవిజ్ఞానవేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ విజయకుమార్‌రెడ్డి పదవ వర్ధంతి సందర్భంగ వరికుంటపాడు మండలశాఖ జనవిజ్ఞానవేదిక ఘన నివాళులర్పించింది. ఆయనచిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగ జెవివిద్వార విజయకుమార్‌రెడ్డి చేసిన అక్షరాస్యత ఉద్యమం,సారా ఉద్యమం వంటి కార్యక్రమాలతోపాటు నెల్లూరు ఆసుపత్రి స్థాపించి ప్రజలకు వైద్యపరంగ కూడ సేవలందించిన మహనీయుడు విజయకుమార్‌రెడ్డని కొనియాడారు. ఈకార్యక్రమంలో జెవివిజిల్లా ట్రెజ్‌రర్ డిఎం చలం,మండల ప్రధానకార్యదర్శి డివి రమణయ్య,సభ్యులు గొళ్ళ రమణయ్య,బి కొండారెడ్డి,రసూల్,కృష్ణప్రసాద్‌రాజు,మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ జైల్లో కాకాణిని కలిసిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



**నెల్లూరు రూరల్, మే 28, ప్రభాతవార్త :** నెల్లూరు కేంద్ర కారాగారంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డితో వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డితో కలిసి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి ఎంతో ధైర్యంగా ఉన్నారని తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. చేయని తప్పుకు అక్రమ కేసు బనాయించి కూటమి ప్రభుత్వం కాకాణి గోవర్ధన్ రెడ్డిని జైల్లో పెట్టిందన్నారు. ఈ కేసులో కాకాణి గోవర్ధన్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని కక్షపూరితంగానే ఇరికించారని అన్నారు. మైన్స్ కేసుకు సంబంధించి, గత ప్రభుత్వంలోనే విచారణ జరిగి ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోలేదని అధికారులు రిపోర్ట్‌లు ఇచ్చారని, అయినప్పటికీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కక్ష్య సాధింపు చర్యలో భాగంగా కేసు నమోదు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రశ్నిస్తున్న గొంతును నొక్కాలనే ప్రభుత్వం ఈ అక్రమ కేసు బనాయించిందన్నారు. ఈ కేసులో కాకాణి గోవర్ధన్ రెడ్డి క్లీన్ చిట్‌తో బయటికి వస్తారని తెలిపారు. జైల్లో కాకాణి గోవర్ధన్ రెడ్డిని కలిసినప్పుడు కార్యకర్తలకు అండగా ఉండి.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ జూన్ 4వ తేదీన నిర్వహించబోయే వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించి గోవర్ధన్ రెడ్డి కొన్ని సూచనలు చేశారని తెలిపారు. కాకాని గోవర్ధన్ రెడ్డి సూచనలకు అనుగుణంగా జూన్ 4వ తేదీన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వెన్నుపోటు దినాన్ని ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను అర్థమయ్యేలా వివరించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల పై ఎన్ని అక్రమ కేసులు పెట్టిన బెదిరేది లేదని, మరింత దూకుడుగా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ఆశ్రిత్ రెడ్డి, 4,16 డివిజన్ ఇన్చార్జిలు సందాని, సగిలి జయరామిరెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు సింగంశెట్టి అశోక్, అస్లాం, కొండయ్య శేఖర్, పెంచలయ్య, వెంకటేష్, ప్రసన్న, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## బిఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో వీల్ చైర్ బహుకరణ



**బిట్రగుంట మే 28 ప్రభాతవార్త :** మండలం విశ్వ నాథ రావు పంచాయితీకు చెందిన డోలా పురుషోత్తం జ్ఞాపకార్థం వారి కుమారుడు డోలా హరి కుటుంబ సభ్యులు తేజవరుణ్ (బాబి) సుమారు ఆరు వేల రూ పాయలు విలువ చేసే వీల్ చైర్ ముంగమూరు భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రా నికి బుధవారం వితరణగా అందచేసినట్లు బిఎంఆర్ యువసేన అధ్యక్షులు సమిఉల్లా తెలిపారు. ఈ సంద ర్భంగా వారి కుటుంబసభ్యులకు ధన్య వాదములు తెలిపారు. ఆదరణ కేంద్రం డైరెక్టర్ సింహాద్రిరావు మాట్లాడుతూ సమీఉల్లా మిత్ర బృందం బిఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో ఇటీవల చాలా చాలా మంచి కార్యక్రమాలు చేస్తున్నారు అని అభినందించారు. ఈ కార్యక్రమం లో ఆదరణ డైరక్టర్ కట్టెపల్లిభవాని డి. శ్రీధర్ రావు, కట్టేపల్లి ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

## గొప్ప సంఘసంస్కర్త స్వర్గీయ ఎన్టిఆర్



**కావలిరూరల్, మే28 ప్రభాతవార్త :** సంక్షేమానికి కొత్తబాట చూపిన గొప్ప సంఘసంస్కర్త విశ్వ వి ఖ్యాత నటసార్వభూమ, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని జిల్లా తెలుగురైతు ఉపాధ్యక్షులు బొట్టగుంట శ్రీ హరి నాయుడు తెలియచేశారు. ఎన్టిఆర్ 102వ జయంతి సంద ర్భంగా బొట్లగుంట శ్రీహరినాయు డు ఆధ్వర్యంలో బుధ వారం కావలి ముసునూ రులోని స్వర్గీయ ఎన్టిఆర్ విగ్రహా నికి పూలమాలలువేసి, ఘనంగా నివాళులర్పించి మాట్లా డారు. ఆడ బిడ్డలకు ఆస్తిలో హక్కు, మండల వ్యవస్థతో పాలనారంగాన్ని ప్రజల వద్దకు తీసుకువెళ్లిన మహా నీయులు స్వర్గీయ ఎన్టిఆర్ అని తెలియచేశారు. పక్కాఇళ్ల నిర్మాణంతో పేద ప్రజలకు అండగా నిలవడడమే కాకుండా కిలో బియ్యం 2 రూపాయలకు అందించి పేదలకు ఆకలి తీర్చిన నేత స్వర్గీయ ఎన్టిఆర్ అని తెలియ చేశారు. తెలుగుప్రజలు గౌరవంగా తలెత్తుకుని నిలబడాలనే సంకల్పంతో ఎన్నో సంక్షేమపథకాలను ప్రవేశపె ట్టిన మహనీయులు స్వర్గీయ ఎన్టిఆర్ అని తెలియచేశారు. ఆయన అశయసాధనకోసం అందరూ కృషి చేయాలని తెలియచేశారు. ముసునూరు తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో స్వర్గీయ ఎన్టిఆర్ జయంతి



**కావలిరూరల్, మే28 ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమ ంత్రిస్వర్గీయ నందమూరి తారకరామారావు 102వ జ యంతిని కావలి, రుద్రకోట గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సుశీల్‌కుమార్‌ప్రియ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించి ఎన్టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించ డం జరిగింది. డాక్టర్ ఎ.సుశీల్‌కుమార్‌ప్రియ మాట్లాడారు. స్వర్గీయ ఎన్టిఆర్ జీవితం, ఆయన చేసిన సేవలను కొనియాడారు. స్వర్గీయ ఎన్టిఆర్ ఆదర్శాలను అనుసరించాలని ప్రతిజ్ఞ చేశారు. విద్యార్ధులు, అధ్యాపకులు పాల్గొని ఆయన విఖ్యాత నటనాప్రస్థానాన్ని ప్రజాసేవను స్మరించుకోవడం జరిగింది.

## తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దశదిశలా వ్యాపింపచేసిన "ఎన్టిఆర్"



**కావలి, మే28 ప్రభాతవార్త :** తెలుగు ప్రజల ఆత్మగౌ రవాన్ని దశదిశలా వ్యాపింపచేసిన ఘనత స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకే దక్కిందని పలువురు టిడిపి నేతలు కొనియాడారు. కావలి మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డులో ఐ కాన్ సెంటర్‌లో ఉన్న ఎన్టిఆర్ విగ్రహంవద్ద బుధవారం 102వ జయంతి వేడు కలు ఘనంగా నిర్వహించారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సూచనల మేరకు టిడిపి శ్రేణు లు ఎన్టిఆర్ జయంతిని నిర్వహించారు. ఎన్టిఆర్ విగ్రహానికి పూలమాలలువేసి, నివాళులర్పించి టిడిపి నేతలు మాట్లాడారు. దివంగత నందమూరి తారక రామారావు 1982లో తెలుగుదేశం పార్టీ స్థాపించి పేద ప్రజలకు సేవలందించారన్నారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో పేదవాళ్ల అభ్యు న్నతికి పెద్దపీట వేశారన్నారు. తెలుగుదేశంపార్టీ స్థాపనతో తెలుగు ప్రజల ఆత్మగౌరవం పెరిగిందన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల వారికి సేవలందించడానికి టిడిపి ఆహర్నిశలు పాటుపడుతుందన్నారు. ఎన్టిఆర్ 102వ జయంతి వేడుకలు తెలుగుదేశంపార్టీ చరిత్రలో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తాయన్నారు. ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచే విధంగా భవిష్యత్తు కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఎన్టిఆర్ చేసిన సేవలను, తెలుగు సినీ పరిశ్రమకు అందించిన విశ్వవిఖ్యాతిని వారు కొనియాడారు. టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు,ప్రధానకార్యదర్శి జ్యోతిబాబురావు, కావలి నియోజకవర్గ లీగల్‌సెల్ కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కు మార్‌చౌదరి, టిడిపి లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోట్లూరి శ్రీనివాసులు, ఏగూరి చంద్రశేఖర్, ఏరియా వైద్యశాల అడ్వైజరి కమిటీ డైరక్టర్ చవల రామకృష్ణ, టిడిపి పట్టణ మహిళ అధ్యక్షురాలు ఆయేషాబేగం, కాకి ప్రసాద్, నేరెళ్ల జ్వాల చంద్రశేఖర్, టిడిపి నేతలు, మహిళలు, పాల్గొన్నారు.

## పేద ప్రజల ఆశాజ్యోతి విజయ్‌కుమార్



**మర్రిపాడు, మే28ప్రభాతవార్త:** జనవిజ్ఞానవేదిక వ్యవ స్థాపకులు కీర్తిశేషులు డాక్టర్ విజయ్‌కుమార్ పేద ప్రజల ఆశాజ్యోతి అని జిల్లా ఉపాధ్యక్షులు కొక్కంటి పోలయ్య పేర్కొన్నారు.ఆయన బుధవారం మండల కేంద్రమైన మర్రిపాడు సెంటర్‌లో డాక్టర్ విజయ్ కుమార్ 10వ వర్ధంతి సంతాప సభను నిర్వహి ంచారు. ఈసందర్భంగా ఆయన మాటా్లడుతూ పేద ప్రజలకు వైద్యసేవలందించడంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. వైద్యరంగంలో ప్రవేశం మొదలుకొని పేదలకు ఉచితంగా సేవలు చేసిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. బడుగు,బలహీన వర్గాల కోసం సారా ఉద్యమాన్ని చేపట్టి పాదయాత్రను కూడా చేసిన సందర్భాలున్నాయన్నారు. అందుకు సంబంధించి మర్రిపాడు తో ఆయనకు ప్రనత్యేకమైన సంబంధం ఉందన్నారు. సారా ఉద్యమంలో భాగంగా మండలంలో పాదయాత్ర చేశారన్నారు. అటువంటి వ్యక్తి ప్రస్తుతం మన ముందు లేకపోవడం బాధాకరమన్నారు. పేద ప్రజలకు అవగాహనను కల్పిచేందుకు జనవిజ్ఞానవేదిక ను స్థాపించి పలు కార్యక్రమాలను చేపట్టారన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక గౌరవాధ్యక్షులు, వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్, మండల అధ్యక్షులు సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి రసూల్‌బాబు, ఉపాధ్యక్షులు కె.వేణుగోపాల్, కె.శ్రీనివాసులు, గంగవరపు శ్రీనివాసులునాయుడు, బత్తల రత్నయ్య, జెవివి సభ్యులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన వ్యక్తి ఎన్టీఆర్



**నెల్లూరు, మే28, ప్రభాతవార్త-వైద్యం :** నెల్లూరు నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆదేశాల మేరకు స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ మేరకు ముందుగా దివంగత నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పరస్పరం మిఠాయిలు తినిపించుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి జెన్నీ రమణయ్య మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆరాధ్య దైవంగా ఆత్మ గౌరవ ప్రతీకగా, సినీ రంగంలో రాజకీయ రంగంలో మకుటంలేని మహారాజుగా ఆయనకు ఆయనే సాటి అన్న విధంగా రాణించిన వ్యక్తి ఎన్టీఆర్ అని తెలిపారు. పేద ప్రజలకు ఎనలేని సేవలు చేసి తెలుగు ప్రజల గుండెచప్పుడుగా ఎన్టీఆర్ నిలిచిపోయారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు మన్నెం పెంచల్ నాయుడు మాట్లాడుతూ ఎన్టీఆర్ వద్ద నుండి ప్రతి ఒక్కరు క్రమశిక్షణను నేర్చుకోవాలనితెలిపారు. ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి తెలుగుజాతికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో నన్నే సాహెబ్, సాబీర్ ఖాన్, పొత్తూరి శైలజ, కనపర్తి గంగాధర్, మాతంగి కృష్ణ, ఖాదర్ భాషా, బీవీ లక్ష్మీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## 1నుంచి రేషన్‌షాపులవద్ద సరకుల పంపిణి



**వరికుంటపాడు,మే28,ప్రభాతవార్త:**రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు జూన్ 1వతేది నుంచి 15వ తేదివరకు రేషన్ షాపు లవద్దనే సరకులు పంపిణి చేయడం జరు గుతుందని డిప్యూటి తహసిల్‌దార్ నిమ్మల చెంచయ్య తెలిపారు.బుదవారం తహసిల్‌దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిం చారు. ఈసందర్భంగ ఆయన మాట్లాడుతు జూన్1నుంచి 15వరకు ప్రతి డీలర్‌షాపువద్ద అందు బాటు లోవుండి కార్డుదారులకు సరకులు పంపిణి చేయాలని అందులో ఎలాంటి అలసత్వం ప్రదర్శించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించాడు.గ్రామాల్లో లబ్దిదారులకు ముందుగానేసమాచారం అందించాలని సూసిం చారు. తప్పనిసరిగ స్టాక్ బోర్డులను ఏర్పాటుచేసి సరకులు పంపిణి చేయాలని తెలిపారు.ఈకార్యక్రమంలో డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**వింజమూరు, మే28, ప్రభాతవార్త :** నందమూరి తారక రమారావు 102వ జయంతి వేడుకలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘన ంగా నిర్వహించారు. ఎంపీడీఓ కే.శ్రీనివా స్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధి హామీ ఎమ్మార్సీ మండల పరిషత్ సిబ్బంది కలిసి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీ రామారావు విశ్వవిఖ్యాత నట సార్వభౌమ బిరుదంకితుడని సినీ జగత్తులో ఎదురులేని కథానాయకునిగా అదే విధంగా రాజకీయాలలో తనదైన శైలిలో ఆంధ్రుల ఆత్మాభిమానాన్ని చాటే విధంగా తెలుగుదేశం పార్టీని స్థాపించి అనతి కాలంలోనే అధికారాన్ని చేపట్టిన ఏకైక వ్యక్తిగా పేరుపొందాడన్నారు. రాజకీయ రంగంలో ఎదురులేని నాయకునిగా ముఖ్యమంత్రిగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల హృదయాలలో చెరగని ముద్రను వేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కార్యాలయాల సిబ్బంది ఉన్నారు.

## మరుపురాని మహానేత నందమూరి తారక రామారావు



**వింజమూరు ,మే28, ప్రభాతవార్త :** మరుపురాని మహానేత విశ్వవిఖ్యాత నటసార్వభౌముడైన నంద మూరి తారక రామారావు 102 వ జయంతి వేడుక లను వింజమూరులో బుధవారం ఘనంగా నిర్వహి ంచారు. తెలుగుదేశం మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి పర్యవేక్షణలో పట్టణ అధ్యక్షుడు కోడూరు నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను జరిపించారు. ముందుగా పాత బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తరువాత జయంతి కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నందమూరి తారక రమారావు తెలుగువారి ఆత్మ గౌరవాన్ని నిలిపేందుకు గల్లీ నుంచి ఢిల్లీ దాకా చాటి చెప్పారన్నారు. ఆయన తెలుగుదేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలల కాలంలోనే అధికారాన్ని చేపట్టిన మహానేతగా కొనియాడారు తన పాలనలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంస్కరణలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రెండు రూపాయలకు కిలో బియ్యం జనతా వస్త్రాలు మాండలిక వ్యవస్థ తదితర పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. సినీ రంగంలో మగటం లేని మహారాజుగా కళామతల్లి ముద్దుబిడ్డగా తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని చిత్ర రంగంలో భగవంతుడు అంటే ఎన్టీఆర్ ఏ తెలుగు ప్రజలకు గుర్తు వస్తారన్నారు. శ్రీరాముడైన శ్రీకృష్ణుడైన శ్రీ వెంకటేశ్వరుడైన ఈ పరమేశ్వరుడైన ఎన్టీఆర్ సాక్షాత్కరిస్తారని అలాంటి మహానుభావుని జయంతిని జరుపుకోవాలని మనందరి అదృష్టం అన్నారు. నాడు ఆయన స్థాపించిన తెలుగుదేశం పార్టీని ప్రస్తుతం చంద్రబాబునాయుడు ఆయన ఆశయాలకు అనుగుణంగా పార్టీని ముందుకు నడిపిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సంక్షేమ అభివృద్ధి రెండు కళ్ళుగా ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. అలాగే ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే నాయకత్వంలో ఈ నియోజకవర్గం ఎంతో అభివృద్ధిని సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యన్నం రామచంద్రారెడ్డి, చల్లా శ్రీనివాసులు యాదవ్, గూడా నర్సారెడ్డి, ఎమ్మెస్ నాయుడు, జూపల్లి రాజారావు, వనిపెంట వెంకట సుబ్బారెడ్డి, దాట్ల కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు ఆనంగి రమణయ్య, కేవస్ నాయుడు, షేక్ ఖాజావలి, ఆరికొండ శ్రీనివాసులు, తిరుపతి, ఆచారి, కటకం ప్రసన్న కుమార్, గువ్వల కృష్ణారెడ్డి, వేమూరి దొరస్వామి నాయుడు, పి.మాల్యాద్రి, గోసు మహేష్ యాదవ్, షేక్ బాదుల్లా, డి.వెంకటేశ్వరరావు, దిద్దిగుంట శ్రీనివాసులురెడ్డి, చిట్నేని వెంకటేశ్వర్లు, భోజనపు ఆనంద్, నీలం పెరుమాళ్ళు శ్రీనివాసరెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## సినిమా థియేటర్‌ను తనిఖీ చేసిన తహశీల్దార్



**వింజమూరు, మే28, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం వింజమూ రులోని శిరీష సినిమా హాల్‌ను తహశీల్దార్ ఎస్ ఎం హమీద్ తనిఖీ చేశారు. సినిమా హాల్లో లైసె న్స్ ఉందా లేదా బాత్రూంలు శుభ్రంగా ఉన్నా యా లేవా, హాల్లో మెనూ అధిక రేట్లకు విక్రయి స్తున్నారా లేదా సీటింగ్ పరిధి ఎంత అదనంగా ఉందా తదితర అంశాలను పరిశీలించారు. కార్యా లయ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సినిమా హాల్లోని సీట్ల ఏర్పాటు దానికి కెపాసిటీని పరిశీలించి చూశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఇమ్రాన్ ఖాన్, వీఆర్వో రవితేజ, తిరుపతిరావు, థియేటర్ మేనేజర్ మస్తాన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగాసనాలు



**వింజమూరు, మే28, ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో యోగాసనాల కార్యక్ర మాన్ని ప్రారంభించారు. యోగా మాస్టర్ నోటి మాల్యాద్రి రెడ్డి ఆధ్వర్యంలో ఈ యోగా శిక్షణ తరగతులు నిర్వహించబడుతున్నాయి. సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా జీవితంలో ఒక భాగం కావాలని అప్పుడే మానసికమైన ప్రశాంతత ఉల్లాసం వస్తుందన్నారు. యోగ వల్ల ఒత్తిడిని జయించవచ్చని తెలిపారు. ప్రశాంతమైన మనసు కలిగినటువంటి వ్యక్తి ఆనందదాయకంగా ఉండగలరని ఆయన తెలిపారు. యోగాసనాలు అనేక రకాలుగా ఉన్నాయని వాటిలో ముఖ్యంగా ప్రాణాయామము చేయాల్సి ందన్నారు. ప్రాణాయామం వల్ల గాలి పీల్చడం వదలడం అనే పక్రియ వలన స్వచ్ఛమైన ఆరోగ్యాన్ని అనుభవించేందుకు వీలుంటుందని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ రోజులో కనీసం ఒక గంట అయినా యోగాసనాలు లేదా ధ్యానం చేసినట్లయితే జీవితం ప్రశాంతమయం అవుతుందన్నారు. ఎంపీడీఓ కే.శ్రీనివాసరెడ్డి, యోగా శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో తెలుగుదేశం నాయకుడు మృతి



**వింజమూరు, మే28, ప్రభాతవార్త :** వింజమూరు మండలం శంఖవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు భోగిరెడ్డి శ్రీనివాసులురెడ్డి(47) అనారోగ్య సమస్యతో మృతి చెందారు. ఈయన అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల కాలం లో కిడ్నీ వ్యాధి సోకడంతో డయాలసిస్ చేయించుకుంటూ మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్ద కోల్పోవడంతో ఆ కుటుంబం దీనావస్థలో ఉంది. బాధిత కుటుం బానికి స్థానిక సర్పంచ్ భోగిరెడ్డి మల్లేశ్వరి, ఓబుల్‌రెడ్డి ఇతర నేతలు పరామర్శించారు.

## కలిగిరి లో ట్రాఫిక్ కష్టాలు పట్టించుకోని పోలీస్ శాఖ



**కలిగిరి, మే28, ప్రభాతవార్త;** కలిగిరిలో ప్రతిని త్యం ట్రాఫిక్‌జామ్ అయ్యి ప్రజలు, వాహన దారులు ఇబ్బందులు పడుతున్నా పోలీసులు మాత్రం ప్రేక్షక పాత్రవహిస్తుంటారు.కలిగిరి పోలీస్ స్టేషన్ పక్కనే కూరగాయల అంగళ్లు ఉన్నాయి. అక్కడ ప్రతినిత్యం ఉదయం 4 గంటలనుండి కూరగాయల షాపుల వద్ద ఆటోలు బారులు తీరుతుంటాయి .కూరగా యలషాపు లుకూడా రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు సాగిస్తు ంటారు. ఎంతవరకు వస్తాయంటే రోడ్డుపైనే ఆటోలు నిలుపుదలచేసి కూరగాయలు బేరాలు చేస్తుంటారు.ఉదయం 4నుండి ప్రారంబమయ్యే ఈసమస్య ఉదయం 8గంటలవరకూ కొనసాగుతుంది.సుదూర ప్రాంతాలనుండి వచ్చే ఆటోలు వేలరూపాయలకు కలిగిరిలో కూరగాయలు కొని పల్లెల్లో అమ్మకాలు సాగిస్తుంటారు. అయితే ఈక్రమంలో కొనుగోలుదారులు రోడ్డుకు పక్కన పెట్టి కొనుగోలుచేయడం ఇతరవాహనాలుకు అడ్డగా ఆటోలు గంటలకొలదీ ఉండిపోవడంతో ప్రతినిత్యం కలిగిరి బస్టాండు సెంటరువద్ద ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడుతుంది. దీనితో ఉదయాన్నే ప్రయాణాలుచేసే వాహనదారులు, ప్రజలు పలుఇబ్బందులను ఎదుర్కొం టున్నారు.గతంలో ఇలానే ఉన్నా పోలీసులు యజమానులను కట్టడి చేయడంతో ఆంటోలు కూరగాయల షాపుల యజమానులు ఇతరులకు ఇబ్బందులు కలగకుండావ్యాపారాలు చేసుకొనేవారు.దానితో వాహన దారులకు కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తేవికావు.కానీ ఇప్పుడు అటువైపు పోలీసులు కనెత్తైనా చూడకపో వడంట్రాఫిక్ పోలీసులు అటువైపుకు రాకపోవడంతో సమస్య మరలా మొదటికే వచ్చిందని వాహనదారులు , ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలీసులు, అదికారులు ఇప్పటికైనా కలుగజేసుకొని గతంలో లాగా కూరగాయల అంగళ్లను రోడ్డుపైన నిరోదించాలని కూరగాయల ఆటోలు, పార్సిల్ లారీలను నడిరోడ్లపై పెట్టకుండా నిరోదించాలని ప్రజలు కోరుతున్నారు.

## దివంగత సీఎంకు ఘన నివాళులు



**కోవూరు, మే 28 ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి , దివంగత నేత ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా బుధవారం ఆ మహనీయుని చిత్రపటానికి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నిర్మలానందబాబా మాట్లాడుతూ పేద ప్రజల హృదయాల్లో కొలువైన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాజర్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, జూనియర్ అసిస్టెంట్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, తదితరులు ఉన్నారు.

## యోగాపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలి



**కోవూరు, మే 28 ప్రభాతవార్త :** యోగాపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేలా సచివాలయ ఉద్యోగులు గ్రామ రెవెన్యూ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, తహసీల్దార్ నిర్మలానందబాబాలు తెలిపారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మండల స్థాయి అధికారులు , సచివాలయ ఉద్యోగులు, సిబ్బందికి యోగాపై యోగా గురువు, న్యాయవాది సలీమ్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను సచివాలయ ఉద్యోగులు, గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామ స్థాయిలో ప్రజలకు శిక్షణ ఇచ్చేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరినీ యోగాంధ్ర కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేయించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.ఈ సందర్భంగా యోగా గురువు సలీమ్ యోగాకు సంబంధించిన పలు ఆసనాలపై అవగాహన కల్పించారు.

## ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ప్రకటించాలి



**కోవూరు, మే 28 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డు ప్రకటించాలని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి పేర్కొన్నారు. కోవూరులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆ మహనీయుని 102వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ మహనీయుడు తెలుగుదేశం పార్టీ స్థాపించిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి గిన్నిస్ బుక్ రికార్డు సాధించారన్నారు. రాజకీయాలకు దివంగత నేత కొత్త అయినా 40 సంవత్సరాల క్రితం ఆయన ప్రవేశపెట్టిన పథకాలు నేడు దేశమంతా అమలవుతున్నాయంటే అదే ఆయన గొప్పదనానికి నిదర్శనమన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించారన్నారు. పేదవానికి కనీస అవసరాలు అయిన కూడు, గూడు, గుడ్డ ఇవ్వడమే తన సిద్దాంతం అని చెప్పి ఆచరణలోకి తెచ్చిన మానవతావాది ఎన్టీఆర్‌యే అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు రాము, సత్యనారాయణరెడ్డి, విజయ్‌కుమార్, మురళీకృష్ణారెడ్డి, గోపాల్, మహమ్మద్, నరసింహారావు, మదన్‌మోహన్, వేమయ్య, మురళి, తదితరులు ఉన్నారు.

## ప్రేక్షకులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి



**కోవూరు, మే 28 ప్రభాతవార్త :** కోవూరులోని శ్రీనివాస థియేటర్, మైథిలి థియేటర్‌లను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర టూరిజం సినిమాటోగ్రఫీ మంత్రి కె. దుర్గేష్ ఆదేశాల మేరకు బుధవారం నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె శ్రీనివాస థియేటర్‌లో క్యాంటిన్‌లో ఉన్న ఆహార పదార్థాలను వాటర్ బాటిల్ ధరలను మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. శ్రీనివాస థియేటర్‌లో మరుగుదొడ్ల నిర్వహణ, శుభ్రత లోపించిందన్నారు. వీటిపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందన్నారు. రెండవ సారి థియేటర్ తనిఖీకి తహసీల్దార్ వస్తారని, మరోసారి ఇటువంటి నిర్లక్ష్యణా ధోరణి ఎక్కడా కనిపించకూడదని థియేటర్ యాజమానికి సూచించారు. ప్రేక్షకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో థియేటర్ యాజమానులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు.ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే అటువంటి థియేటర్లపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు ఆమె వెంట కోవూరు తహసీల్దార్ నిర్మలానందబాబా, డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## దివంగత సీఎం ఎన్టీ రామారావుకు ఘన నివాళులు



**కోవూరు, మే 28 ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి , దివంగత నేత ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా బుధవారం ఆ మహనీయుని చిత్రపటానికి కోవూరులోని మండల పరిషత్ కార్యాలయంలో పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీహరిరెడ్డి ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారుమాట్లాడుతూ పేద ప్రజల హృదయాల్లో కొలువైన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు ఉషారాణి, , సీనియర్ అసిస్టెంట్ సురేష్, టైపిస్ట్ సురేష్, ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

# టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఏపీలో శాంతియుత పాలన

- ఐదు కోట్ల ఆంధ్రుల రాజదానికి 500 ఎకరాలు చాలంట..
నలుగురుండే జగన్‌రెడ్డి కుటుంబానికి 42 ఎకరాలు కావాలంట
- రాష్ట్ర నాశనమైపోవాలని కోరుకుంటున్న దుర్మార్గుడు జగన్‌మోహన్‌రెడ్డి
- నెల్లూరు జైలులో ఉన్న అందగాడిని చూసేందుకు ఎప్పుడొస్తాడో
- కడప మహానాడులో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



**నెల్లూరు మే28, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరికి ఎన్టీఆర్ పుట్టిన రోజు శుభాకాంక్షలు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజలందరికి ఎన్టీఆర్ బ్రాండ్ అని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్టీఆర్ 302 సినిమాల్లో నటిస్తే అందులో 275 హిట్ అయ్యాయన్నారు. 94 సినిమాలు 300 రోజులు ఆడగా , 185 సినిమాలు 175 రోజులు ఆడాయి. చెప్పుకుంటూ పోతే ఇంకా చాలా విశేషాలు ఉన్నాయి. ఎన్టీఆర్ స్థాపించిన పార్టీలో మనమందరం సభ్యులుగా ఉన్నాము, ఆస్ట్రేలియాలో జూన్‌లో ఎన్టీఆర్ వజ్రోత్సవ వేడుకలు జరగబోతున్నాయి. ఆ కార్యక్రమంలో పాల్గొనే అదృష్టం నాకు దక్కిందన్నారు. గత ఏడాది జూన్‌లో సీఎం చంద్రబాబునాయుడు సీఎంగా బాధ్యతలు చేపట్టి కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజే రాష్ట్రంలో శాంతి నిర్మాణం మొదలైందన్నారు. ప్రజలకు వైసీపీ దుర్మార్గపు పాలన నుంచి విముక్తి లభించింది. సీఎం పదవి కోసం గతంలో మత కల్లోలాలు సృష్టించిన వాళ్లను చూశాం అన్నారు. నక్సలిజంను కంట్రోల్ చేసేందుకు చర్యలు చేపట్టిన చంద్రబాబు నాయుడి ప్రాణాలకు అలిపిరి ఘటనతో ముప్పు వచ్చిందన్నారు. భగవంతుడి దయ, ప్రజల ఆశీస్సులతో ఆయన క్షేమంగా బయటపడ్డారన్నారు. తెలుగుదేశం అంటేనే శాంతియుత పాలనకు మారుపేరు, వైసీపీ పాలనలో జరిగిన దుర్మార్గాల గురించి చెప్పాలంటే ఎంత సమయం ఇచ్చిన చాలదన్నారు. అమరావతి రైతులు పాదయాత్రగా తిరుమలకు వెళ్తుంటే మా సర్వేపల్లి నియోజకవర్గం పొందలకూరులో టెంట్లు వేస్తే తియించేశారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్ల వ్యాన్‌ని కూడా పోలీసులతో బలవంతంగా పంపించేశాడు. అప్పుడు ఎమ్మెల్యేగా మంత్రిగా ఆ దుర్మార్గాలకు పాల్పడిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ రోజు నెల్లూరుసెంట్రల్ జైలులో ఉన్నాడు.కాకాణి వల్లభనేని వంశీ లాంటి వ్యక్తులు మొదట్లో కుటుంబాలగురించి మాట్లాడిన రోజే వైసీపీనుంచి సస్పెండ్ చేసి ఉంటే జగన్‌రెడ్డికి మరో నాలుగైదు సీట్లు అదనంగా వచ్చుండేవి. మొన్న వళ్లబనేని వంశీని జైలులో చూడడానికి వెళ్లిన జగన్‌రెడ్డి ఆయన చాలా అందగాడని చెప్పుకొచ్చాడు. మరో అందగాడు కాకాణిని చూడడానికి కూడా నెల్లూరుకు వస్తాడేమో అన్నారు. ఈ రాష్ట్రం బాగుండటం జగన్‌మోహన్‌రెడ్డికి ఇష్టం లేదన్నారు. ఐదు కోట్ల జనాభా కలిగిన ఏపీ రాజధానికి 500 ఎకరాలకు సరిపోతుందంట. తల్లి, చెల్లిని తరిమేసిన జగన్‌మోహన్‌రెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు. నలుగురు సభ్యులుండే జగన్‌రెడ్డి కుటుంబానికి యల్లహంకలో 29 ఎకరాలు, పులి వెందులలో 5 ఎకరాలు, ఇడుపులపాయలో 5 ఎకరాలు, లోటస్ పాండ్‌లో ఎకరా, తాడేపల్లిలో 2 ఎకరాలు మొత్తంగా 42 ఎకరాలు. ఐదు కోట్ల ఆంధ్రుల రాజధానికి మాత్రం 500 ఎకరాలు చాలంట.. ఆయన కుటుంబానికి మాత్రం 42 ఎకరాలు కావాలంట, రాష్ట్రం పతనం కావాలి, నాశనమైపోవాలి, తాను, తన కుటుంబ సభ్యులు మాత్రమే బాగుండాలని భావించే వ్యక్తి చేతుల్లో నుంచి రాష్ట్రం బయటపడిందన్నారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో శాంతియుత మార్గంలో పయనిస్తోందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు వస్తుంటే జగన్‌రెడ్డి కడుపుమంటతో రగిలిపోతా డన్నారు. ఉర్సా కంపెనీకి ఎకరా రూ.50లక్షల చొప్పున ఇస్తే ఇడ్లీ, వడ రేటుకు ఇచ్చారని పచ్చి అబద్దాలు చెప్పాడు. ఎమ్మెల్యే పదవికి రాజీనామాచేసి రావాలని లోకేష్‌బాబు సవాల్ విసిరితే పత్తాలేడన్నారు. 8.13 వృద్ధి రేటుతో ఏపీ జాతీయ స్థాయిలో రెండో స్థానంలో ఉంటే ఆ విషయంలోనూ విషంగక్కాడు. రాష్ట్రం నాశనమైపోవాలని కోరుకునే జగన్ మోహన్‌రెడ్డి ఆలోచలన్నీ సాక్షి పత్రికలో ప్రతిబింబిస్తాయన్నారు. ఇలాంటి వ్యక్తి మన రాష్ట్రానికి సీఎంగా పని చేయడం దురదృష్టకరం అన్నారు. 2012 లో రూ.43 వేల కోట్లు అవినీతికి పాల్పడిన సీబీఐ కేసులో ఏ 1గా ఉన్న వ్యక్తి జగన్‌మో హన్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎగ్గొట్టి తాడేపల్లిలో ముసుగేసుకుని కూర్చున్న వ్యక్తి జగన్‌రెడ్డి అన్నారు. జైళ్లకు పోయి మగోళ్ల అందాలను చూసొచ్చి మీడియా ముందు మురిసిపోతూ వర్ణించే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చిన్నాన్నను చంపిందెవ్వరన్నా.. అమరావతి రాజధాని నాశనం చేసిందెవరన్నా, పోలవరం ప్రాజెక్టుకుని పడుకోబెట్టిందెవరన్నా, తల్లిని చెల్లిని తరిమేసిందెవరన్నా, మీ బిడ్డ మీ బిడ్డ అంటూ జనం బుడ్డ ముంచిన వ్యక్తి ఎవరంటే ప్రజలందరూ చెప్పే ఒక్కటే పేరు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అలాంటి దుర్మార్గుడి పాలన నుంచి రాష్ట్రం బయటపడి కూటమి ప్రభుత్వం, చంద్రబాబునాయుడి చేతుల్లోకి వచ్చింది. మన అందరికి నారా లోకేష్ బాబు అండ ఉంది. ఇక ఈ రాష్ట్ర ప్రగతిని ఎవరు ఆపలేరన్నారు.




## దివంగత నేతకు ఘన నివాళులు



**కోవూరు, మే 28 ప్రభాతవార్త :** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాల మేరకు దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆ మహనీయుని చిత్రపటానికి టీడీపీ నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఇంతా మల్లారెడ్డి, నాటకరాణి వెంకట్ , మొలకల శ్రీధర్‌రెడ్డి, సాయిరెడ్డి, సాయి జయంత్ రెడ్డి, బెల్లంకొండ విజయ్, వెంకటేశ్వర్లు, లోకేష్, గోవిందు, గురు మహేష్, హరి, చంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.

## కాంట్రాక్టర్‌కు రూ. లక్ష చెక్కు అందజేత



**కోవూరు, మే 28 ప్రభాతవార్త:** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పచ్చిపాల రామనాథమ్మ చారిటబుల్ ట్రస్టు సహకారంతో 15 లక్షల వ్యయంతో మరుగు దొడ్ల నిర్మాణానికి బుధవారం భూమి పూజ కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు.ఈ మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ ప్రభాకర్‌కు ట్రస్టు కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి లక్ష రూపాయల చెక్కును ఎంపీడీవో శ్రీహరిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుచైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చైతన్య, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఝాన్సీరాణి, మండల విద్యాశాఖ అధికారి -2 చెంచులక్ష్మమ్మ, ఉపాధ్యాయులు గీతామాధురి, దేవిక, సీఆర్‌ఎంటీ ఉషా, ఆంజనేయులు, శ్రీనివాసులురెడ్డి, తదితరులు ఉన్నారు.

## తెలుగు ప్రజల ఆరాధ్యదైవం స్వర్గీయ ఎన్‌టిఆర్



కావలిరూరల్, మే28 ప్రభాతవార్త తెలుగుప్రజల ఆత్మగౌరవాన్ని ప్ర పంచానికి చాటిచెప్పిన తెలుగు ప్రజల ఆరాధ్యదైవం మాజీ ముఖ్య మంత్రి, విశ్వవిఖ్యాత, నటసార్వ భౌమ స్వర్గీయ నందమూరి తారక రామారావు అని కావలి మాజీ ము న్సిపల్ ఛైర్మన్ డాక్టర్ యన్.ప్రభా కర్‌నాయుడు, మాజీ కౌన్సిలర్ షేక్.మస్తాన్‌లు తెలియచేశారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా డాక్టర్ యన్.ప్ర భాకర్‌నాయుడు ఆధ్వర్యంలో కావలి రామ్మూర్తిపేటలోని డాక్టర్ ప్రభాకర్‌నాయుడు ప్రజా వైద్యశాలనందు బుధవారం స్వర్గీయ ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. డాక్టర్ యన్.ప్రభాకర్‌నాయుడు, షేక్.మస్తాన్‌లు మాట్లాడారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ప్రజాస్వామ్యానికి కొత్త అర్ధం చెప్పిన మహనీయుడు స్వర్గీయ ఎన్‌టిఆర్ అని తెలియచేశారు. సంక్షేమానికి కొత్తబాటలు చూపిన సంఘ సంస్కర్త స్వర్గీయ ఎన్‌టిఆర్ అని తెలియచేశారు. పేద ప్రజలకు కూడు, గూడు, గుడ్డ అనే మూడు ప్రాధమిక అవసరాలను తీర్చడమే తమ జీవితాశయంగా భావించిన వ్యక్తి స్వర్గీయ ఎన్‌టిఆర్ అని తెలియచేశారు. ప్రజల ఆరాధ్యదైవం స్వర్గీయ ఎన్‌టిఆర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వసతిగృహ సంక్షేమాధికారి షేక్. బాష, వైద్యశాల పిఆర్‌ఓ అక్కిలిగుంట ఆనందరావు, సిబ్బంది రవి, సాయి, ఉదయ్‌కుమార్, పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి రామనాథమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్టు శ్రీకారం



**కోవూరు, మే 28 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పచ్చిపాల రామనాథమ్మ చారిటబుల్ ట్రస్టు సహకారంతో 15 లక్షల వ్యయంతో మరుగుదొడ్ల నిర్మాణానికి బుధవారం భూమి పూజ కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు.ట్రస్టు చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇటీవలే పాఠశాలలో రహదారి ప్రహరీ గోడ అస్తవ్యస్తంగా ఉండడంతో తమ ట్రస్టు ద్వారానే వాటికి నూతన రూపు తేవడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలోని బాలికలకు ఆశించిన మేర మరుగుదొడ్లు లేకపోవడంతో తమ ట్రస్టు ద్వారా రూ. 15 లక్షల వ్యయంతో ఈ మరుగుదొడ్లు నిర్మిస్తున్నామన్నారు. జిల్లాలో కెల్లా ఈ పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ ట్రస్టు యొక్క ప్రధాన ఉద్దేశమన్నారు. ఇటీవల 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో కూడా ఈ పాఠశాల విద్యార్థినులు మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించి ఈ పాఠశాల పేరు ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేశారన్నారు. సాధ్యమైనంత త్వరలో ఈ నిర్మాణాలను పూర్తిచేసి బాలికలకు ఉపయోగపడేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న రోజుల్లో మరో 30 లక్షల వ్యయంతో ఈ పాఠశాల విద్యార్థినులకు డైనింగ్ హాల్ కల్పించేలా ప్రణాళికలు కూడా రూపొందించడం జరిగిందని ట్రస్టు కార్యదర్శి డాక్టర్ పచ్చిపాల మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీహరిరెడ్డి ట్రస్టు చేస్తున్న సేవలను కొనియాడారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చైతన్య, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఝాన్సీరాణి, మండల విద్యాశాఖ అధికారి -2 చెంచులక్ష్మమ్మ, ఉపాధ్యాయులు గీతామాధురి, దేవిక, సీఆర్‌ఎంటీ ఉషా, ఆంజనేయులు, శ్రీనివాసులురెడ్డి, ఉన్నారు.

**- కాంట్రాక్టర్‌కు రూ. లక్ష చెక్కు అందజేత** ఈ మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ ప్రభాకర్‌కు ట్రస్టు కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి లక్ష రూపాయల చెక్కును ఎంపీడీవో శ్రీహరిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

## 43 సంవత్సరాలుగా ఎన్‌టిఆర్ జయంతి నిర్వహిస్తున్న రమణయ్య



**బుచ్చి మే 28 ప్రభాతవార్త** ఎన్‌టిఆర్ అంటే చిన్నపటి నుండి ఎంతో అభి మా నం. ఎప్పుడు ఇంటి ముందు ఎన్‌టిఆర్ బొమ్మ వుంటుంది. బుచ్చిరెడ్డిపాళెంకి గిరిజాహాల్ సెంటర్‌లో పిండిపిల్లు పెటుకొని జీవ నం సాగిస్తున్న గుత్తి కొండ రమణయ్య ఎన్‌టిఆర్ జయంతి కార్యక్రమాన్ని టిడిపి సీనియర్ నాయకులు దొడ్ల కోదండరామిరెడ్డి సహకారంతో ఘనంగా నిర్వహించారు. దొడ్ల కోదండరామిరెడ్డి మా ట్లాడుతు అటు సిని రంగంలో,ఇటు రాజకీయ రంగంలో రారాజుగా వెలుగొందిన మహనీయుడు నంద మూరి తారకరామారావు అని అయన కొనియాడారు. రమణయ్యకి ఎన్‌టిఆర్ వీరాభిమాని అని ఆయన ఏటా ఇంటి వద్ద ఆయన జయంతి చేయడం అభినందించ దగ్గ విషయమని అన్నారు. ఈకార్యక్రమంలో టిడిపినా యకులు బత్తల హరికృష్ణా,దుగ్గి శెట్టి హరినాద్, కిషోర్, దశరద్,చిలకా బాలకుమార్, మైనార్టీ నాయకులు సుభానీ, సునీల్ తదితరులు పాల్గోన్నారు. దొడ్ల కోదండరామిరెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు.

## రీ సర్వేకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలి



**కోవూరు, మే 28 ప్రభాతవార్త :** కోవూరు మండలం వేగూరు గ్రామంలో జరుగుతున్న భూ ముల రీ సర్వే కార్యక్రమానికి రైతులు పూర్తిస్థాయిలో సద్వి నియోగం చేసుకోవాలని నెల్లూరు ఆర్డీవో నాగసంతోష్ అనూష అన్నారు. కోవూరు మండ లం వేగూరు పంచాయతీలో జరుగుతున్న రీ సర్వే కార్యక్ర మాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబం ధించి ఏమైనా సమస్యలు ఉంటే ఈ సర్వేలో వాటిని పూర్తిస్తాయిలో పరిష్కరిం చుకోవాలన్నారు. గత సంవ త్సరాలుగా పరిష్కారం కాని భూ సమస్యలు ఈ సర్వే ద్వారా పరిష్కారం అయ్యేందుకు అవకాశం ఉంటుం దన్నారు. వేగూరు రీ సర్వే కార్యక్రమంలో కోవూరు ఎమ్మె ల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేకంగా చొరవ చూపారన్నారు. తహసీల్దార్, రెవెన్యూ, సర్వే సిబ్బంది శ్రద్ధల తో ఈ సర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నారని, రైతులు దీనిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకో వాలన్నారు. ఆమె సర్వే బృందానికి పలు సూచనలు చేవారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ నిర్మలానందబాబా, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధు సూదన్‌రావు, సర్వేయర్ రమేష్ గౌడ్, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు ఉన్నారు.

## ఏపీ మాజీ ముఖ్యమంత్రి ఎన్ టి కు నివాళులు



**నెల్లూరు కార్పొరేషన్,మే 28 ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూ రి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని స్థానిక మూలా పేటలోని ఆయన విగ్రహానికి నెల్లూరు నగరపాలక సంస్థ కమి షనర్ వై.ఓ నందన్ బుధవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.




## కార్పొరేషన్లో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి



**నెల్లూరు కార్పొరేషన్,మే 28 ప్రభా త వార్త:** మాజీ ముఖ్యమంత్రి నంద మూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకొని నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఆయన చిత్రపటానికి కమిషనర్ వై.ఓ నందన్ బుధవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సిటీ ప్లానర్ హిమబిందు, సెక్రటరీ శ్రీలక్ష్మి, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, మేనేజర్ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

## పి4 కార్యక్రమంలో కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం అభినందనీయం : కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్,మే 28 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం విజన్ - 2047 కార్యక్రమంలో భాగంగా పేదల సాధికారత కోసం రూపొందించిన పి4 కార్యక్రమంలో కార్పొరేట్ సంస్థలు భాగస్వామ్యం కావడం అభినందనీయమని కమిషనర్ వై.ఓ నందన్ అభినందించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో వివిధ కార్పొరేట్ సంస్థలకు చెందిన ప్రతినిధులు కమిషనర్ ను బుధవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల సహకారంతో నిరుపేదలు ఎక్కువగా నివసించే ప్రాంతాలలో నూతనంగా పార్కుల నిర్మాణం, పాఠశాలల నిర్మాణం, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణాలతో పాటు పేదల గృహాలకు సోలార్ విద్యుత్ ఏర్పాటు, వీధుల కూడళ్లలో వివిధ అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రణాళికలను రూపొందించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ హిమ బిందు పాల్గొన్నారు. కమిషనర్ ను కలిసిన వారిలో ఎస్.ఇ.ఐ.ఎల్ కంపెనీ ప్రతినిధి కామేశ్వరరావు, సింహపురి ఎస్టేట్ డెవలపర్స్ ప్రతినిధి చెన్నారెడ్డి, రిలయన్స్ జియో కంపెనీ ప్రతినిధి విష్ణు ఉన్నారు.